సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024




జీవించు.. సాధించు

జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. నేడు 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం'. 8లో



రెగ్యులర్ చేయాలని ఆందోళన

వివిధ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని నర్సులంతా ఆందోళన నిర్వహించారు. 8లో



శ్రీస్కంద గణపతిగా సంపత్ వినాయగర్ 8లో

న్యూస్‌రీల్

వరద బాధితుల కోసం నిత్యావసరాలు



నిత్యావసరాల వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రైతు బజార్లలోని రైతులు, వ్యాపారులు, జ్ఞానాపురం న్యూ హోల్‌సెల్ మార్కెట్ వ్యాపారుల సహకారంతో 10.5 మెట్రిక్ టన్నుల కూరగాయలు, నిత్యావసర సరకులను విశాఖ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సేకరించింది. ఈ సరకులతో కూడిన వాహనాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్, ఎస్టేట్ అధికారులు జి.ప్రసాద్, టి.వై.నాయుడు, వ్యాపారులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సీపీ పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సీపీ బాగ్చి

విశాఖ సిటీ: కైలాసగిరిపై బస్సు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పరామర్శించారు. కైలాసగిరి కొండ పై నుంచి కిందకు వస్తున్న ఒక టూరిస్టు బస్సు అదుపు తప్పి గోడకు ఢీకొనడంతో అందులో ఉన్న 17 మందికి గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సీపీ వెంటనే ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రాస్తారోకో నేడు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించనున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గత 1,306 రోజులుగా కూర్మన్నపాలెం కూడలి వద్ద నిరాహార దీక్షలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో పోరాటాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలని, పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లపై కూర్మన్నపాలెం కూడలి, నగరంలో పలు కూడళ్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించనున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్న ఈ ఆందోళనలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

విశాఖ సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 59 ఫిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

హమ్మయ్యా..

తగ్గుముఖం పట్టిన వానలు



తీరంలో ఎగసిపడుతున్న అలలు



కళకళలాడుతున్న ముడసర్లోవ రిజర్వాయర్

- పునరావాస కేంద్రాలకు 65 మంది తరలింపు
- రిజర్వాయర్లలో స్థిరంగా నీటిమట్టాలు
- మేహాద్రి లోతట్టు ప్రాంతాల్ని అప్రమత్తం చేసిన అధికారులు
- నిరంతరం పరిస్థితిని సమీక్షించిన మేయర్ హరివెంకట కుమారి
- విజయవాడ నుంచి అధికారులకు సూచనలిచ్చిన కమిషనర్

సాక్షి, విశాఖపట్నం : వాయుగుండం పూరీ సమీపంలో తీరం దాటడంతో సోమవారం ఉదయం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టాయి. రెండు రోజులుగా ముసురుతో ఇంటికే పరిమితమైన ప్రజలు వానలు తగ్గగానే యథావిధిగా తమ కార్యకలాపాలకు ఉపక్రమించారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న 65 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మరోవైపు పైన కురుస్తున్న వర్షాలతో వరదనీరు వచ్చి చేరుతుండటంతో రిజర్వాయర్లలో నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. మేహాద్రిగెడ్డలో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో ప్రమాదకరంగా లేకపోయినా లోతట్టు ప్రాంత ప్రజల్ని అప్రమత్తం చేశారు. గ్రేటర్‌లో సహాయక చర్యలకు సంబంధించిన ఏర్పాట్లను మేయర్ హరివెంకటకుమారి నిరంతరం పర్యవేక్షించగా.. విజయవాడ వరద సహాయక చర్యల్లో ఉన్న కమిషనర్ సంపత్‌కుమార్.. అక్కడి నుంచి జీవీఎంసీ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 10 గంటల తర్వాత పూర్తిగా వర్షం ఆగిపోవడంతో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులకు ఉపక్రమించారు.

జీవీఎంసీకి వచ్చే రిజర్వాయర్ల ప్రస్తుత నీటిమట్టం వివరాలు

రిజర్వాయర్	గరిష్ట నీటిమట్టం	ప్రస్తుతం
ఏలేరు	86.56 మీటర్లు	85.60 మీ.
తాటిపూడి	297 అడుగులు	290.20
రైవాడ	114 మీటర్లు	111.35 మీ
మేహాద్రిగెడ్డ	61 అడుగులు	57.50 అ.
గోస్తనీ	35 అడుగులు	29 అ.
గంభీరం	126 అడుగులు	124.6 అ
ముడసర్లోవ	169 అడుగులు	162.7 అ.

8వ తేదీ ఉదయం 8.30 నుంచి 9వ తేదీ ఉదయం 8.30 వరకూ వర్షపాతం (మి.మీల్లో)

ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం
గోపాలపట్నం	79	ఆరిలోవ	66.5	కూర్మన్నపాలెం	59.75
మదీనాబాగ్	74.75	గంభీరం	66.5	శ్రమశక్తినగర్	58.0
వేపగుంట	73.0	సుజాతనగర్	66.25	అక్కిరెడ్డిపాలెం	54.5
పెందుర్తి	72.0	బుచ్చిరాజుపాలెం	65.75	పెదగంట్యాడ	56.75
అప్పన్నపాలెం	69.75	నాయుడుతోట	63.5	గాజువాక	51.25
		పద్మనాభం	60.0	అగనంపూడి	48.25

పునరావాస కేంద్రాలకు తరలింపు

నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్ అధికారుల్ని, ప్రజల్ని అప్రమత్తం చేశారు. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ.. ఇప్పటివరకూ ప్రస్తుతం 65 మందిని జీవీఎంసీ ఏర్పాటుచేసిన పునరవాస కేంద్రాలకు తరలించారు. జోన్–8లోని 91వ వార్డు పరిధిలోని రామకృష్ణ నగర్ సమీపంలో కొండవాలు రక్షణ గోడ జారినందున ఆ ప్రాంతంలోని 38 మందిని జీవీఎంసీ ఏర్పాటుచేసిన గోపాలపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలకు తరలించారు.



జీవీఎంసీ పునరావాస కేంద్రంలో రామకృష్ణనగర్ ప్రజలు

జోన్–1 తగరపువలస పబ్లిక్ లైబ్రరీలో ఏడుగురు, జోన్–2 పరిధిలోని 13వ వార్డులో జైభీమ్ నగర్ ప్రాంతంలోని 20 మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.

గ్రేటర్ పరిధిలో వర్షం సృష్టించిన నష్టం

వర్షం వల్ల నష్టం వాటిల్లిన జోన్లు	8
ధ్వంసమైన రహదారులు	39.37 కి.మీ
ధ్వంసమైన ఓపెన్ డ్రైన్లు, యూజీడీ	5.72 కి.మీ
ధ్వంసమైన మంచినీటి పైప్‌లైన్‌లు	400 మీటర్లు
పాడైన వీధిదీపాలు	126
నష్టం వాటిల్లిన జీవీఎంసీ స్కూళ్లు, భవనాలు, కమ్యూనిటీ సెంటర్లు	9

63వ వార్డులోని కాకరలోవ పంప్ హౌస్, 60వ వార్డులోని ఓల్డ్ ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీ, 62వ వార్డులోని స్టాఫ్ క్వార్టర్స్ కాలనీల్లోని పంప్‌హౌస్‌ల్లో శ్లాబ్‌లు కూలిపోవడంతో నీటిసరఫరాకు విఘాతం కలిగింది.

ఛిద్రమైన రహదారులు, డ్రైనేజీలు

ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో నగరంలోని రహదారులు ఛిద్రమయ్యాయి. పలు చోట్ల గుంతలు ఏర్పడగా.. కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జీవీఎంసీ పరిధిలో 39.37 కి.మీ మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. ఓపెన్ డ్రైన్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ 5.72 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. వివిధ ప్రాంతాల్లో జీవీఎంసీకి చెందిన భవనాలు, మంచినీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. పాతనగరంలోని వివిధ లోతట్టు ప్రాంతాలు వరద నీరు తగ్గడంతో బురద వాతావరణం నెలకొంది. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులకు జీవీఎంసీ సిబ్బంది ఉపక్రమించారు. కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు.



నగరంలో పలు చోట్ల ధ్వంసమైన రోడ్లు

రిజర్వాయర్లలో పెరుగుతున్న వరదనీరు



నగర ప్రజలకు తాగునీటిని అందించే రిజర్వాయర్లలో నీటి మట్టం గరిష్ట స్థాయికి సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం సాయంత్రం తాటిపూడి రిజర్వాయర్‌కు వరద నీరు భారీగా చేరుతూ ప్రమాదకరస్థాయికి చేరుకున్న నేపథ్యంలో రెండు గేట్లు ఎత్తి.. నీటిని విడిచి పెట్టారు. మరోవైపు మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ కూడా ప్రమాదకర స్థాయికి చేరుకుంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 61 అడుగులు కాగా.. ఆదివారం నాటికి 54 అడుగులకు చేరుకుంది. కేవలం 24 గంటల్లో మూడున్నర అడుగులు పెరిగి ప్రస్తుతం 57.5 అడుగులకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రిజర్వాయర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో ఒకవేళ గరిష్ట స్థాయికి చేరుకుంటే గేట్ల నుంచి స్వల్పంగా నీటిని దిగువ కాలువల్లోకి విడిచిపెట్టాలని నిర్ణయించారు. 24 గంటలూ అప్రమత్తంగా ఉండేలా రిజర్వాయర్ వద్ద ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశారు. ముడసర్లోవ రిజర్వాయర్ సామర్థ్యం 170 అడుగులు కాగా ప్రస్తుతం 163.11 అడుగులకు నీరు చేరుకుంది. కంబాల కొండ వెనుక భాగం నుంచి ఇందులోకి వరద నీరు చేరడానికి మార్గాలున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఓవర్ ఫ్లో అయ్యే అవకాశం ఉందని జీవీఎంసీ ముడసర్లోవ నీటి సరఫరా విభాగం అధికారులు భావిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఎండీ ఔట్

- సెలవుపై వెళ్లాలంటూ ఉక్కు మంత్రిత్వ శాఖ హుకుం
- క్షణాల్లోనే ప్రాజెక్టు డైరెక్టర్ బాగ్చీకి అదనపు బాధ్యతలు



అతుల్ భట్



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఓవైపు కేంద్రం నుంచి సహకారం లేకపోవడం.. మరోవైపు నష్టాలతో సతమతమవుతున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని వరుస వివాదాలు వెంటాడుతున్నాయి. తాజాగా సీఎండీని బలవంతంగా తప్పించేస్తూ కొత్త వివాదానికి తెరతీశారు. రిటైర్‌మెంట్‌కు సమయం ఉన్నా వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోవాలంటూ నేరుగా ఉక్కు మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ వెంటనే డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం చకచకా జరిగిపోయాయి. ఈ హఠాత్పరిణామాలతో ఉక్కు ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. కేవలం వ్యక్తులను మార్చడం ద్వారా ప్లాంటు పరిస్థితి మెరుగుపడే అవకాశం లేదని, నిర్వహణకు అవసరమైన ముడిపదార్థాల లభ్యతను పెంచడంతో పాటు ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రోజుకో నిర్ణయం... : స్టీల్‌ప్లాంట్‌లో రోజుకో నిర్ణయం ఉద్యోగుల్లో కలవరపాటుకు గురిచేస్తోంది. సీఎండీ అతుల్ భట్‌ను కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ సెలవుపై వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేసింది. గత కొంత కాలంగా సీఎండీపై కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ తీవ్ర అసంతృప్తితో ఉండటం వల్లే ఆయనను సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించినట్లు తెలుస్తుంది. స్టీల్‌ప్లాంట్ సీఎండీగా అతుల్ భట్ 2021 సెప్టెంబర్ 13న బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ విరమణ గడువు నవంబర్ 30 వరకు ఉంది. ఇటీవలే కొత్త సీఎండీ నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించి.. ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్(ఫ్యాక్ట్) ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.శక్తిమణిని ఎంపిక చేశారు. ఈయన డిసెంబర్ మొదటి వారంలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంతలోనే ప్రస్తుత సీఎండీ భట్‌ని సెలవుపై వెళ్లిపోవాలంటూ ఒత్తిడి తీసుకురావడం స్టీల్‌ప్లాంట్‌లో చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారుల ఆదేశించడంతో నవంబర్ 30 వరకూ సర్వీసు ఉన్నప్పటికీ 3 నెలల పాటు సెలవు ఇవ్వాలని భట్ దరఖాస్తు చేసుకున్నారు.

ముందుగానే ఫిక్స్...! : భట్‌ని ఎలాగైనా సెలవులో పంపించేయాలని ఉక్కు మంత్రిత్వ శాఖ ముందుగానే ఫిక్స్ అయ్యింది. ఉక్కు మంత్రిత్వశాఖ న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించనున్న స్టీల్‌ప్లాంట్ సమీక్షకు హాజరయ్యే జాబితాలో సీఎండీ అతుల్ భట్ పేరు లేకపోవడంతో ఈ వాదనకు మరింత బలం చేకూరింది. ఈ సమీక్షకు డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) బాగ్చీ, డైరెక్టర్ (కమర్షియల్) ప్రసాద్, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్‌లను మాత్రమే ఆహ్వానించారు. భట్ సెలవు పెట్టిన క్షణాల్లోనే ఆయన స్థానంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసేసింది. ఉక్కు మంత్రిత్వశాఖ మంగళవారం జరిగే రివ్యూలో తదుపరి చర్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలుస్తుంది. అదేవిధంగా బుధవారం న్యూఢిల్లీలో జరగనున్న కేంద్ర సబ్ కమిటీ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై కీలక నిర్ణయం వెలువడనుందని ఉక్కు అధికార వర్గాల సమాచారం.

ఆది నుంచి వివాదాల భట్...!

సీఎండీగా అతుల్ భట్ వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత దిగజారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బొగ్గు కొనుగోలుతో పాటు వివిధ సంస్థలతో చేసుకున్న పలు ఒప్పందాలు ప్లాంట్‌కు కోలుకోలేని నష్టాలు కలిగించాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్యకలాపాల నిర్వహణ మెరుగుపరచకుండా... ఉద్యోగుల వేతనాలు, ఆర్థిక ప్రయోజనాలపై కోతలు వేయడం అతుల్ భట్ ప్రారంభించారు. ఒక్కొక్క సదుపాయం తొలగించడంతో పాటు ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేని పరిస్థితికి స్టీల్‌ప్లాంట్‌ను దిగజార్చారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాల ఏర్పాటులో ఆయన తీసుకున్న నిర్ణయాలు వల్ల ఒకానొక దశలో స్టీల్‌ప్లాంట్ మూత పడే పరిస్థితికి దారి తీసిందనేది ప్రధాన విమర్శ. మరోవైపు ముడి పదార్థాల కొనుగోలులో యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలపై ఉక్కు మంత్రిత్వశాఖ, సెంట్రల్ విజిలెన్స్, సీబీఐ తదితర సంస్థలకు పలువురు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంత కాలంగా కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆయన పని తీరుపై అసంతృప్తితో ఉంది. గత రెండు వారాలుగా దిగజారి పోతున్న స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఉక్కు కార్యదర్శి సీఎండీని పక్కనపెట్టినట్లు కార్మికవర్గాలు భావిస్తున్నాయి.

ఇసుక నిల్వలు నిల్



ఖాళీగా దర్శనమిస్తున్న అగనంపూడి ఇసుక డిపో

- విశాఖలోని డిపోల్లో నిండుకున్న ఇసుక
- రీచ్‌ల నుంచి ఇసుక తరలింపులో నిర్లక్ష్యం
- డిపోల ఏర్పాటులో ప్రభుత్వ వైఫల్యం
- వర్షాల నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి ఇసుక తరలింపు కష్టమే..

మహారాణిపేట: జిల్లా వాసులకు ఇసుక కష్టాలు మరింత పెరగనున్నాయి. విశాఖలో ఉన్న అగనంపూడి ఇసుక డిపోలో ఇసుక సోమవారం రాత్రికి ఖాళీ అయింది. శ్రీకాకుళం నుంచి ఇసుకను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాల నేపథ్యంలో శ్రీకాకుళంలో కూడా ఇసుక నిల్వలు అందుబాటులో లేవు. వచ్చే శుక్రవారం వరకు వేచి ఉండాల్సిందే. ఎందుకంటే అక్కడ నుంచి తరలించే అవకాశం లేదు. దీంతో విశాఖవాసులకు ఇసుక కష్టాలు ఇంతింత కాదయా..? అన్న పరిస్థితులు ఎదురయ్యాయి.

ఒక్క రేణువునూ తరలించలేదు...!

వాస్తవానికి ఉత్తరాంధ్ర జిల్లాలో విశాఖ జిల్లాలో ఇసుకకు ఎక్కువ డిమాండ్. ఇక్కడ మాత్రం రీచ్‌లు లేవు. ఫలితంగా అటు శ్రీకాకుళం, ఇటు తూర్పుగోదావరి జిల్లాలోని ఇసుక రీచ్‌ల మీద ఆధారపడాల్సి ఉంటోంది. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం విశాఖ నగర అవసరాల కోసం ప్రత్యేకంగా భీమిలితో పాటు అగనంపూడిలో ఇసుక డిపోలను ఏర్పాటు చేసింది. ఈ డిపోల్లో లక్ష టన్నుల మేర ఇసుకను నిల్వ చేసి ఉంది. భీమిలి ఇసుక డిపోలో 39,800 టన్నులు, అగనంపూడి ఇసుక డిపోలో 63 వేల టన్నుల ఇసుకను గత ప్రభుత్వం నిల్వ చేసి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత రెండున్నర నెలలుగా ఈ ఇసుకనే విక్రయిస్తూ వస్తోంది. వర్షాల నేపథ్యంలో ముందస్తుగా ఈ డిపోలకు అదనపు ఇసుకను చేర్చాల్సి ఉంది. అయితే, ఇటువంటి పనేమీ కూటమి ప్రభుత్వం చేయలేదు. కేవలం గతంలో ఉన్న ఇసుక నిల్వలను మాత్రం విక్రయించారు. ఒక్కటంటే ఒక్క టన్ను కాదు కదా... కనీసం ఇసుక రేణువునూ కూడా అదనంగా ఈ డిపోలకు తరలించలేదు. ఫలితంగా ఇప్పుడు విశాఖ నగర అవసరాల కోసం శ్రీకాకుళం నుంచి వచ్చే ఇసుక కోసం ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తింది.

125 కిలోమీటర్ల నుంచి...!

విశాఖలో ఇంటి నిర్మాణం చేపడుతున్న సాధారణ వ్యక్తుల నుంచి బిల్డర్ల వరకూ ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే బ్లాక్‌లో ఇసుక ధర రూ.2 వేల నుంచి రూ.2,200కు చేరింది. డిపోల్లో రూ.1076కు కొనుగోలు చేసి... బ్లాక్‌లో కూటమి నేతలు కాస్తా అధిక ధరకు విక్రయించారు. ఇప్పుడు ఈ నిల్వలు కూడా అయిపోవడంతో శ్రీకాకుళం నుంచి కేవలం ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌లే దిక్కుగా మారిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి నుంచి విశాఖ నగరానికి ఇసుక చేరాలంటే 125 కిలోమీటర్ల మేర రవాణా చార్జీల భారాన్ని అదనంగా వినియోగదారుడు భరించాల్సి రానుంది. ఇందుకోసం ప్రతీ కిలోమీటరుకు టన్నుకు రూ.6 చొప్పున రవాణా చార్జీలు వసూలు చేయనున్నారు. అయితే ఈ ధర తమకు గిట్టుబాటుకాదని లారీ యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా అదనంగా చెల్లిస్తే తప్ప ఇసుక ఇంటికి చేరని పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అధిక ధరకు బ్లాక్‌లో ఇసుకను కొంటున్నామని. ఇక నుంచి రవాణా చార్జీలు కూడా అదనపు భారం తమపై పడనుందని బిల్డర్లు వాపోతున్నారు. ఉచిత ఇసుక పేరుతో హామీలిచ్చి.. అదనపు భారాన్ని తమపై మోపుతున్నారని మండిపడుతున్నారు.

రూలర్స్..రూల్స్ బ్రేక్

వీరికి వేయరా ఫైన్..!

- హెల్మెట్ లేకుండా ప్రయాణించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు
- సామాన్యులకేనా నిబంధనలు, జరిమానాలు, లైసెన్సు రద్దు
- 5 రోజుల్లో 1199 మంది లైసెన్సులు తాత్కాలిక రద్దు



ప్రత్యేక డ్రైవ్‌లో తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



లైసెన్స్ రద్దు చేసి రశీదును వాహనదారుడికి అందిస్తున్న పోలీసులు (ఫైల్)

ఈ ఫొటోల్లో రవాణా శాఖ అధికారులు ఎక్కడికక్కడ ద్విచక్ర వాహనదారులను నిలిపివేసి... హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి రూ.1,030 అపరాధ రుసుం విధించడంతో పాటు మూడు నెలల పాటు లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు.



హెల్మెట్ లేకుండా మేహాద్రి గెడ్డ పరిశీలనకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఎమ్మెల్యే గణబాబు, కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఈ ఫొటోల్లో ఏకంగా జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చొని మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించారు. వాహనం నడుపుతున్న వ్యక్తి గానీ వెనుక కూర్చున్న కలెక్టర్, గణబాబు గానీ హెల్మెట్ ధరించలేదు. ద్విచక్ర వాహనం మీద ప్రయాణించే ఇద్దరూ హెల్మెట్లు ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను స్వయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు తుంగలో తొక్కుతున్నా.. అటువైపు కనీసం రవాణా శాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు. చట్టం అధికారం ఉన్న వాడికి చుట్టమనే నానుడి ఇటువంటి అధికారులు, ప్రజాప్రతినిధుల వల్ల మరింత బలపడినట్టయింది.

గోపాలపట్నం: జిల్లాలో హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్నారంటూ... ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు 1,199 మందికి రూ.1,035 అపరాధ రుసుం విధించడంతో పాటు లైసెన్సులను తాత్కాలికంగా మూడు నెలల పాటు రద్దు చేశారు. మూడు నెలల వరకు వీరెవ్వరూ వాహనాన్ని నడిపేందుకు అవకాశం లేదు. వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు కఠినంగా వ్యవహరించాల్సిందే. దీనిని ఎవరూ తప్పుపట్టడం లేదు. అయితే సాధారణ ప్రజలకు ఒక విధంగా.. అధికారం ఉన్న వారి పట్ల మరో విధంగా ప్రవర్తించడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

విస్తృతంగా తనిఖీలు

ద్విచక్రవాహనం నడిపేవారితోపాటు వెనుక కూర్చున్న వారు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని సుప్రీం కోర్టు ఆదేశాలను ఈ నెల ఒకటో తేదీ నుంచి జిల్లాలో అమలు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు రవాణా శాఖ అధికారులు పలు చోట్ల విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వారికి రూ.1035 జరిమానాతో పాటు 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తున్నారు. కేవలం ఐదు రోజుల్లో 1,199 మంది లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశారు. వీరు మూడు నెలల తరువాత రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లి జరిమానా విధించిన రశీదు, ఆధార్ కార్డు అందజేస్తే లైసెన్సును పునరుద్ధరిస్తారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

హెల్మెట్లు లేకుండా ప్రయాణించడంతోనే చాలా మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న వారు కూడా కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని కొద్ది రోజులుగా అవగాహన కల్పించాం. ఈ నెల ఒకటో తేదీ నుంచి నిబంధనలను అమలు చేస్తున్నాం. ఐదు రోజుల్లో 1,199 మంది లైసెన్సులను రద్దు చేశాం. పోలీసుల వద్ద సుమారు 3 వేల వరకు ఈ రశీదులున్నాయి. వాటిని కూడా సేకరించి రద్దు చేసే చర్యలు చేపడతాం.

– రాజారత్నం, ఉప రవాణా కమిషనర్, విశాఖ

జీవీఎంసీ కార్మికుల సమ్మె నోటీసు

- కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆనందరావు ఆధ్వర్యంలో ఆందోళన


ధర్నాలో పాల్గొన్న జీవీఎంసీ కార్మికులు

సీతమ్మధార : జీవీఎంసీలోని పలు విభాగాలకు చెందిన కార్మికుల డిమాండ్ల పరిష్కారానికిగాను సమ్మె నోటీసు ఇచ్చామని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్, లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు వెల్లడించారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీలోని నీటి సరఫరా, యూజీడీ, పంప్ హౌస్, ప్లాంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇంజినీరింగ్ సెక్షన్లలో పబ్లిక్ వర్క్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, పీఎల్‌సీ సెక్షన్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.25,410, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.29,610 వంతున వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జీవీఎంసీ అధికారులు ప్రభుత్వ జీవోలు, కౌన్సిల్ తీర్మానాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సోమవారం నీటిసరఫరా ఆపేసి టోకెన్ సమ్మె ద్వారా నిరసన తెలియజేస్తున్నామన్నారు. తొమ్మిదిమంది అధికారుల నివేదిక ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కేటగిరీ విభజన చేసి వేతనాలు చెల్లించాలని కోరారు. ఐటీఐ సర్టిఫికెట్ ఉన్నవారికి సెమీస్కిల్డ్‌గా పరిగణించాలని కోరారు. నీటిసరఫరా ఫిల్టర్‌బెడ్ ఆపరేటర్లను స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. అలాగే వీరికి వారాంతపు సెలవులు, 15 సీఎల్ వర్తింపజేయాలని కోరారు. నీటిసరఫరా, యూజీడీ విభాగాలలో అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. వర్షాలు పడుతున్నందున కార్మికులకు నాణ్యమైన రెయిన్‌కోట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. జీఓ-212 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలని కోరారు. కార్మికులకు పూర్తి స్థాయిలో వేతనాలు ఇచ్చి, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని కోరారు. పబ్లిక్‌హెల్త్ విభాగంలో సీఐటీయూ పేరు చెప్పి 20మంది కార్మికులు డ్యూటీ చేయకుండానే వేతనాలు పొందుతున్నారని ఈ విషయమై తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం, అధిక సంఖ్యలో పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

పీఎస్‌వోలు నైపుణ్యాలు కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: వీఐపీలకు భద్రత విధులు నిర్వర్తించే పీఎస్‌వో/గన్‌మెన్ ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోడానికి సంసిద్ధంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. వీఐపీ భద్రత విధులు నిర్వహించేందుకు ఎంపికైన కానిస్టేబుళ్లకు సోమవారం సిటీ ట్రైనింగ్ సెంటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సీపీ అభ్యర్థన మేరకు రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ విభాగం నుంచి అనుభవజ్ఞులైన అధికారులు నగరానికి వచ్చారు. సోమవారం నుంచి 28వ తేదీ వరకు పీవోస్ విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొన్ని సందర్భాల్లో మావోయిస్టుల దాడుల నుంచి వీఐపీలను పీఎస్‌వోలు కాపాడలేకపోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం నగరంలో మావోయిస్టుల ప్రభావం లేకపోయినప్పటికీ, ఎప్పుడు ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. పీవోస్‌వోలు శారీరకదారుఢ్యం, సత్తువతో పాటు మానసికంగా అలెర్ట్‌గా ఉండాలని సూచించారు. వీఐపీలకు భద్రత కల్పించే పీవోస్‌వోలు 40, 50 ఏళ్లకు పైబడిన వారి స్థానంలో కొత్త వారికి శిక్షణ ఇవ్వాలన్నారు.

వలలో చిక్కుకున్న చేపపిల్ల చివరి నిమిషం వరకూ తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. చిరుతపులి కూడా ఒంటినిండా తూటాలతోనే వేటగాడికి ఎదురొడ్డి నిలుస్తుంది. ఆకతాయి కుర్రాళ్లు కసిదీరా నలిపేసిన సీతాకోకచిలుక అయినా తెగిన రెక్కలతోనే మొండిగా ఎగరాలని చూస్తుంది. సృష్టిలో ఏ జీవికీ ఆత్మహత్య ఆలోచన రాదు – ఒక్క మనిషికే ఆ విపరీత బుద్ధి చిన్న సమస్య రాగానే తల్లడిల్లిపోతాడు. చావే నయమన్న భ్రమలో పడిపోతాడు. అక్షరాస్యులైనా.. నిరక్షరాస్యులైనా.. నిరుద్యోగి అయినా.. జీవితంలో స్థిరపడ్డ వారైనా.. చిన్నపాటి సమస్యకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రేమ వైఫల్యం.. ఒంటరితనం.. నిరుద్యోగం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు.. కారణమేదైనా ప్రాణాలు వదులుతున్నారు. జీవితాన్ని జయించలేక చావును చేరుకుంటున్నారు. నేడు 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.

–విశాఖ సిటీ





జీవించు.. సాధించు

- ఆత్మహత్యలు వద్దు.. సమస్యలపరిష్కారానికి పోరాడదాం
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఆత్మహత్యలు
- బలవన్మరణాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో విశాఖ

జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే.. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. తొందరపాటు జీవితాన్ని చిదిమేస్తుంది. మనపై ప్రేమను పెంచుకున్న కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిలిస్తుంది. గెలవడం ధ్యేయం కావాలి.. కానీ గెలుపే జీవితం కాదు. ఓడినంత మాత్రాన జీవితం వృథా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసానికి మించిన విజయం లేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం విలువ తెలుస్తుంది. ఏ సమస్యకూ ఆత్మహత్య పరిష్కారం కాదు. ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు? ఇది కచ్చితమైన సమాధానం లేని ప్రశ్న. ఇటీవల కాలంలో కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిళ్ల కారణంగా విద్యార్థులే ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.



20 శాతానికి పైగా పెరుగుదల

విశాఖలో బలవన్మరణాలు భయపెడుతున్నాయి. బలవన్మరణాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో విశాఖ ఉంది. ఏటా 20 శాతానికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు జాతీయ నేర నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో సగం విద్యార్థులే కావడం బాధాకర విషయం. చదవ లేక కొందరు, సహచర విద్యార్థులు, ఫ్యాకల్టీ వేధింపులతో మరికొందరు, మార్కులు రాలేదని ఇంకొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలాగే ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో చాలా సందర్భాల్లో బలమైన కారణాలు కనిపించడం లేదని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి బాగా మానసిక ఒత్తిడికి లోనైప్పుడు, సమస్యకు పరిష్కారం లభించనప్పుడు, తమకు ఏం చేయాలో, సమస్య నుంచి ఎలా బయట పడాలో తెలియక, దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఉద్యోగం లేదని, మానసిక రుగ్మతలు, మత్తు మందులకు బానిసవడం, విపరీతమైన భయం, ఎక్కువగా నిరాశకు గురికావడం, విపరీతమైన అప్పులు, జీవితంపై నమ్మకం సన్నగిల్లడం, వ్యవసాయంలో నష్టాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత కాకపోవడం ఇలా అనేక కారణాలు ఉంటున్నాయి.

సంవత్సరం	ఏపీ	విజయవాడ	విశాఖ
2023	9108	673	479
2022	8908	634	461
2021	8067	385	378
2020	7043	324	306

కుటుంబ సభ్యుల పాత్ర కీలకం



ఆత్మహత్యల నివారణకు ముఖ్యంగా కుటుంబ సభ్యుల పాత్ర కీలకం. నిరాశతో ఉన్న వారిని గమనిస్తూ ఉండాలి. వారిని దగ్గరకు తీసుకుని ఆత్మీయంగా ఓదార్చాలి. నేనున్నానంటూ భరోసా కల్పించాలి. సమస్య పరిష్కారానికి సూచనలు చేయాలి. కష్టాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పాలి. విద్యార్థులైతే బాల్యం నుంచే వారిలో మనోధైర్యం నింపాలి. చిన్న చిన్న విషయాలే కాదు పెద్ద సమస్యలు వచ్చినా ఏ విధంగా ఎదుర్కోవాలో వివరిస్తూ ఉండాలి.

పాజిటివ్ ఆలోచనలతో నివారించవచ్చు



ఆత్మహత్యలలో భారతదేశం అగ్ర స్థానంలో ఉంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. నెగిటివ్ ఆలోచనలకు దూరంగా ఉండాలి. పాటిజివ్ ఆలోచనలతో జీవితాన్ని మెరుగుపర్చుకోవచ్చు. ప్రాణం తీసుకునే ఆలోచనలను విరమించుకోవచ్చు. ఆత్మహత్య ఆలోచనలు అసంకల్పితంగా ఉద్భవిస్తాయి. ఆ ఆలోచనలను తక్షణమే ఆపే మందులు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత కౌన్సెలింగ్ కూడా మెరుగైన జీవనానికి దోహదపడుతుంది.

– డాక్టర్ ఎస్.ఎస్.రాజు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు

బైబై గణేశా


నిమజ్జనంకు ముందు పూజలు నిర్వహిస్తూ..

విశాఖ సిటీ /బీచ్‌రోడ్డు : గణేశ్ నిమజ్జన కోలాహలం కొనసాగుతోంది. గణనాథుల విగ్రహాలు ఒక్కొక్కటిగా సాగరతీరానికి చేరుకున్నాయి. యువతీయువకులు డ్యాన్సులతో హోరెత్తిస్తున్నారు.ఆర్కే బీచ్ వినాయక నిమజ్జన కార్యక్రమంతో కళకళలాడింది. జాలారిపేట, ఫిషింగ్ హార్బర్, కోస్టల్ బ్యాటరీ, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షించారు. నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా, ఆయా ప్రాంతాలు ట్రాఫిక్ లేకుండా ఉండాలని సూచించారు. కోలాటం, భజనలతో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


గంగమ్మ చెంతకు గణనాథుడ్ని, సాగనంపుతూ..


జై బోలో గణేశ్ మహరాజ్‌కి..




ఆర్కే బీచ్‌లో వినాయక నిమజ్జనం

శ్రీస్కంద గణపతిగా ..

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి సోమవారం స్కంద గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధికసంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఉత్సవాలలో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2,100 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఈశ్వరుని నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే, శ్రీ సింహశైల సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సహస్రనామం, సామూహిక పారాయణం, కోలాటం, ప్రదర్శించారు. రాగసుధ, పి.లక్ష్మి బృందంచే భక్తిగీతాలాపాన జరిగింది.

కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖ సిటీ: నగరంలో కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీ శ్రీభరత్ పోర్టు యాజమాన్యాన్ని కోరారు. సోమవారం విశాఖ పోర్టును ఆయన సందర్శించారు. విశాఖ అభివృద్ధి, రోడ్డు, రైలు కనెక్టివిటీ మెరుగుపర్చడంతో పాటు నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దీనిపై పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ విశాఖ సమగ్రాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడంలో భాగంగా పలు పనులు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇసుక తరలించండి

మహారాణిపేట: ఇసుక సరఫరా కోసం ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే ఇసుకను రవాణా చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో లారీల ఆపరేటర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ ధరలకు ఇసుకను సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఉప కమిషనర్ రాజారత్నం, జిల్లా మైన్స్ జాయింట్ డైరెక్టర్ రాజు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు సేవలు స్ఫూర్తిదాయకం


శ్రీనివాసరాజును సత్కరిస్తున్న సీఈవో వర్మ

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన భూపతిరాజు శ్రీనివాసరాజు సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని బ్యాంకు సీఈవో డీ.వీ.ఎస్. వర్మ అన్నారు. శ్రీనివాసరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం రాత్రి విశాఖలోని మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని బ్యాంకు అధికారులు, అదేవిధంగా సహకార సొసైటీల సిబ్బంది హాజరై శ్రీనివాసరాజును సత్కరించారు.

కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలి


కేజీహెచ్‌లో ధర్నా చేస్తున్న నర్సులు

మహారాణిపేట: రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని నర్సులంతా ఆందోళన నిర్వహించారు. తమ హక్కుల సాధన కోసం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11,500 మంది నర్సులు (మేల్ /ఫిమేల్) కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారన్నారు. నర్సింగ్ విద్యలో మూడేళ్ల డిగ్రీ చేసినవారు, పీజీ చేసినవారు కోవిడ్‌కు ముందు నుంచి అమూల్యమైన సేవలను అందిస్తున్నారన్నారు. ఆందోళనలో పలువురు నర్సులు పాల్గొన్నారు. అనంతరం సూపరింటిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి


మాట్లాడుతున్న స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్

సీతంపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై ఉక్కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం, విశాఖ ఉక్కు అధికారుల సంఘం, విశాఖ ఉక్కు ఓబీసీ ఉద్యోగుల సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘం సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవా రం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది కాలంగా వేతనాలు సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల కృషితో ప్లాంట్ ఉత్పత్తి నాలుగు మిలియన్ టన్నుల నుంచి ఆరు మిలియన్ టన్నులకు పెరిగి లాభాల బాట పట్టినా ఉద్యోగులకు మాత్రం సకాలంలో వేతనాలు, బకాయిల చెల్లింపు, వేతన సవరణ చేయడంలేదని ఆక్షేపించారు. ప్రస్తుతం ప్లాంట్‌కు సొంత గనులు, ముడిసరకు, వర్కింగ్ క్యాపిటల్ వంటి ఇబ్బందులు ఉన్నాయని ప్రభుత్వాలు చొరవ తీసుకుని పరిష్కరించాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం వల్ల ప్లాంటుకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్రంతో మాట్లాడి స్టీల్ ప్లాంట్ సమస్యను, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా బులుసు సీతారామశాస్త్రి జయంతి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సన్నిధానం నరసింహశర్మ

సీతంపేట : కవి, వేద పండితులు, విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి జయంతి సభ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి స్మారక సమితి ఆధ్వర్యంలో స్థానిక ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో బులుసు సీతారామశాస్త్రి చిత్రపటానికి సన్నిధానం నరసింహశర్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద పండితులుగా, వీరేశలింగం విద్యాలయ తెలుగు భాషాధ్యాపకులుగా, ఫైవ్ పండిట్స్ తెలుగు గైడ్ రూపకర్తగా, సమాలోచన సాంస్కృతిక మాస పత్రిక సారథిగా, హోమియో వైద్యునిగా ఆయన చేసిన సేవలను, ఘనతను వివరించారు. బులుసు సీతారామ శాస్త్రి జీవిత విశేషాలను అతని కుమార్తె కల్లూరి విజయలక్ష్మి సంకలపరిచిన 'పలుకుల భారతి స్ఫూర్తి, విద్వాన్ బులుసు సీతారామ శాస్త్రి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభాధ్యక్షులు డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సీతారామశాస్త్రి కవితా పటిమను ప్రస్తుతించారు. విశ్రాంతాచార్యులు డాక్టర్ కొచ్చెర్లకోట సత్యనారాయణ మాట్లాడుతూ సీతారామశాస్త్రి రచించిన నవల కృతజ్ఞతను సమీక్షించారు. మరో కవి సీహెచ్.చినసూర్యనారయణ చంద్రోదయం నవలను సమీక్షించారు. కార్యక్రమంలో శాస్త్రి కుమారులు బులుసు అనంతరామయ్య, దుర్గాప్రసాద్, మనుమడు కల్లూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	525.00
విజయనగరం	529.00
శ్రీకాకుళం	529.00